# జీవనజ్యోతి

తల్లిదండ్రులను చిన్ననాడు కోల్పోయిన సుమిత్ర దురదృష్టవంతురాలే. ఐతే ఆమె మెట్టినింటి మనుషులు మంచివాళ్లు... వాళ్ల హృదయాలు మంచివి... వాళ్ల ప్రేమ గొప్పది కావటంవల్ల సుమిత్ర అదృష్టవంతురాలు. ఆమె హృదయం ఆ మాధుర్యంతో నిండింది. ఆ తన్మయానందం ఆమెకి వరం అయింది.

సుమిత్ర చదువుకోలేదు. అక్షరాలుకూడా రావు. ఆమె నిరక్షరాస్యతను లోకం క్షమించక పోవచ్చు. కాని అదే ఆమె పాలిట గొప్ప యోగ్యత అయింది. సుందరంకి సుమిత్ర పల్లెటూరిపిల్ల అంటేనే నచ్చింది. అమ్మాయి చదువుకోలేదు అని చెప్పినప్పుడు —— ఆమె రూపం ముందు, ఆమె అమాయకమైన అందం ముందు, చదువు సంధ్యల యోగ్యతలు నిలబడలేదు. చదువుకేముంది ఇల్లాలికి కావలసిన చదువు పెళ్లి తర్వాత చదువుకోవచ్చు. తాను ఆమెకి ఉపాధ్యాయుడు కావచ్చు. చదువుపేరుతో, నాగరికతపేరుతో మంచికిబదులు, వక్రబుద్ధులు, క్షుద్రగుణాలు అలవడుతున్నాయని, సమాజంలోని అవలక్షణాలను అనుకరిస్తున్నారని అతగాడి ఆవేదన. పల్లెపడచు అన్న మాటలోని మాధుర్యంతో అతడు సుమిత్రను స్వీకరించాడు. ఆమె అతడి జీవితంలో

ప్రవేశించినప్పుడు అతడికి తన ఆదర్శం ఈడేరిన సంతోషం కలిగింది. ఆస్తులూ, కట్నాలూ, కానుకలూ లేని నిరాడంబరమైన పెళ్లి జరిగింది.

సుందరం ఆఫీసుకు వెళ్లిపోయిన తర్వాత అత్తయ్యతో చెప్పి సుమిత్ర బిందె పట్టుకుని నదికి వచ్చింది. పెరట్లోనే, అయిదు నిముషాలు నడిస్తే నది. చైత్ర మాసానికల్లా నాగావళి సన్నబడిపోయింది. పాయలు పాయలుగా ప్రవహిస్తూ, మధ్య మధ్య కలుస్తూ పోతుంది. నది అంతా అందమైన ఇసిక. నదిలో మధ్య మధ్య పెద్ద పెద్ద బండలు. ఆ బండల దగ్గర నిలువు లోతు గుమ్ములు. పదిగంటల సమయానికి ఆ రేవులో జనం ఉండరు.

వీధులు తిరిగి రావాల్సిన అవసరం ఏమీలేదు కనుక సుమిత్ర నదికి వచ్చి నదిలోనే స్నానం చేస్తుంది. రెండు మూడు బిందెలు నీళ్లు నదినుండే తీసుకుపోతుంది. పెరటి సందులోంచి వచ్చేస్తే సరుగుడు తోటలు. ఇసిక దిబ్బలు. నది ఆవలి ఒడ్డున చిన్న చిన్న పల్లెలు. తోటలు. ఆ వెనుక జేగురు రంగు కొండలు. ఇంకా... వెనక్కి నీలం కాంతి తెరలు.

రాంబాబు ఓ క్షణం ముందే అక్కడకు వచ్చాడు. రోజూ స్నానానికి వచ్చే వేళ ఇది కాదు. బట్టలు ఉతుక్కోవాలి. తలంటు కోవాలి. తీరిగ్గా స్నానం చేసుకోవాలి. ఆ వేళ సెలవుదినం. రోజూ అయితే ఉదయం ఆరుగంటలకే వచ్చి స్నానంచేసి వెళ్లిపోతాడు. ఇప్పుడు రాంబాబు ఓ బండమీద కూర్చుని బట్టలు తడిపి సబ్బు పెట్టుకుంటున్నాడు.

సుమిత్రను చూడటం రాంబాబుకు ఇదే తొలిసారి. ఆమె జుత్తు ముడి విప్పుకుని తలంటుకునేందుకు సిద్ధమవుతున్నది. ఆమె సిగలోని గులాబీపువ్వు రాలి నీటిలో పడిపోయింది. ప్రవాహం రాంబాబు వేపు పోతున్నది. ఆ గులాబి అలా ఈదుతూ వచ్చి రాంబాబు కూర్చున్న బండ దగ్గర ఆగింది. రాంబాబు ఆ పువ్వును అందుకున్నాడు. ఆమెకి ఆ పువ్వును ఇచ్చెయ్యాలి.

తలలో పువ్వు ఉన్నట్టు సుమిత్రకు గుర్తులేదు. గులాబి రోజూ పూయదు. ఆమె పనుల్లో ఉన్నప్పుడు సుందరం ఆ పువ్వును ఆమె సిగలో పెట్టాడు. ఆమెకి ఆ గుర్తే ఉంటే ఆ పువ్వును ఇంట్లోనే పెట్టి స్నానానికి వచ్చేది. లేదా భద్రంగా తీసి స్నానం చేశాక మళ్లీ ఇంటికి తీసుకుపోయేది.

లలిత మనోహరమైన ఆ గులాబీ తన చేతిలో ఉన్నంతసేపు రాంబాబు సందిగ్ధంలో పడ్డాడు. తర్వాత ఆమెకు ఎట్లా ఇవ్వాలి... మీ గులాబీ పువ్వు కొట్టుకుపోతుంటే అందుకున్నాను అని చెప్పటానికి అతడికి ధైర్యం చాల్లేదు. పరిస్థితి

సంకటంగా మారింది. ఇవ్వాలని సాహసం ఓ పక్క. ఇస్తే ఆమె ఏమంటుందో అన్న భయం ఇంకోపక్క. మొదట్లోనే ఆ పని చేసి ఉంటే బావుండేది. ఇప్పుడు ఇవ్వటానికి అతడికి మనసొప్పటం లేదు. ఇంకా బాధ పడలేక ఆ అందమైన ముగ్ధమనోహరమైన ఆ తాజా గులాబీపువ్వును ప్రవాహంలోకి విడిచేశాడు. అంతట్లోనే సన్నటి ఆ ప్రవాహంలో ఆ గులాబీ దూరమై అదృశ్యమైపోయింది.

నదిలో స్నానం చేస్తున్న సుమిత్ర చుట్టు ప్రక్కల ఎవరున్నారు, ఏం చేస్తున్నారు అన్న ధ్యాస లేకుండా స్నానం చేసుకుంటున్నది. రాంబాబుకు ఆమె వేపు దృష్టి పోలేదు. తొలి యవ్వనంలో ఉన్న ఏ యువకుడయినా తన ఈడుదే అయిన ఆ యువతి స్నానం చేస్తున్నప్పుడు అప్రయత్నంగానే ఆ సౌందర్యాకర్షణకి లోనయ్యేవాడే. కాని రాంబాబుకు అది తప్పు అని అభిప్రాయం. తన తోటి విద్యార్థుల్లో రాంబాబుకు ప్రవరాఖ్యుడు అన్న బిరుదుంది. క్లాసులో ఉన్న ఆడ పిల్లలతో అతడి పరిచయ స్నేహాలు స్వచ్ఛంగా సహృదయంగా ఉండటం, తోటి విద్యార్థులకు విచిత్రంగా ఉంటుంది. నీవు అమ్మాయిగా పుట్టాల్సిన వాడివిరా... అంటారు వాళ్లు.

సుమిత్ర స్నానం కంటే అతడిని ఆకర్షించే దృశ్యం ఆవలి ఒడ్డునే కొంచెం దూరంలో వేరొకటి ఉంది. అక్కడ అంత్యక్రియలు జరుగుతున్నాయి. పంచభూతాల్లో కలిసిపోతున్న ఆ చితాగ్ని దృశ్యం ఆవలి ఒడ్డున కన్పిస్తున్నది.

అంతలో ఒకరిద్దరు ఆడమ్మలు ---- స్నానం చేసి బిందెలతో నీళ్లు ఇంటికి తీసుకుపోవటానికి వచ్చారు. సుమిత్రకన్నా ఆరేడేళ్లు పెద్దవాళ్లు. వాళ్లు సుమిత్రను విచిత్రంగా చూశారు. సుమిత్ర లోకాన్ని పట్టించుకోకుండా స్నానం చేస్తున్నది. నిజానికి సుమిత్రకు ఈ లోకంతో సంబంధం లేదు. ఈ లోకంలో అనేకానేక విరుద్ధాలు, వికృతాలు ఉన్నాయన్న స్పృహలేదు. తెలిసిందంతా కల్లా కపటం ఎరగని ఓ పల్లెటూరు, ఆ ప్రక్కనించి ఓదార్చుకుంటూ ప్రవహించుతూ పోయే నదీమాత నాగావళి, ముద్దులు కురిపించే తాతయ్య, నాన్నమ్మ, అదే ఊళ్లో ఉన్న అమ్మమ్మ, దేవుడు తాతయ్య, అత్తవారింట్లో భర్తా, ఇక్కడా ఆ నాగావళి సైకతాలు, సరుగుడు తోటలు, నదీ స్నానము. చిన్ననాటి నుండి ఆ నదీమాత ప్రేమ పాలనలోనే పెరిగింది.

రాంబాబు మరోసారి పరీక్షగా గులాబీ పువ్వుకోసం వెతుకుతూ చూశాడు. కన్పించలేదు. ఎంతదూరమో పోదు. అయితే సుమిత్రకు ఆ దృష్టే లేదు. ఒంటికి పసుపు రాసుకుని, తలకు స్నానం చేసి, అదే చీరని వంటిమీదే పిండుకున్నది.

సుమిత్రను రాంబాబు మరోసారి పరిశీలనగా చూశాడు. అట్లాంటి చెల్లెలు ఒకరు ఉంటే ఎంత బావుండేది అనిపించేది. అక్కాచెల్లెళ్లు లేని మగపిల్లలు

ఆడపిల్లలతో చనువుగా ప్రవర్తించలేరట... ఇప్పుడు ఉపాధ్యాయ శిక్షణలో రాంబాబు మానసికశాస్త్రం చదువు పుణ్యమా అని మనుషుల మనస్సుల మహాప్రపంచం అర్థమౌతున్నది. రాంబాబుకు సుమిత్ర అందంలో మంచితనం కన్పిస్తున్నది. ఆ మంచితనం వెనక ఆమె హృదయ సౌందర్యం కన్పిస్తున్నది. ఆమె ముఖంలోకి చూస్తున్నాడు.

సుమిత్ర ఇత్తడిబిందెని ఒడ్డున తోమి, కడిగి, నదిలో కొంచెం లోపలికిపోయి బిందెనింపి, చంకన ఎత్తుకోబోతున్నప్పుడు ఆమె ముఖంలో ఒక్కసారి భయం కన్పించింది. బిందె ఒడ్డున పెట్టి వచ్చింది. క్షణంలో ఆమె వాడిన మొక్కలా నిర్జీవమైపోయింది. ఆమె కళ్లలో దిగులు నిండిపోయింది. ఆమె నీళ్లల్లో చేతులు పెట్టి ఇసికలో ఏదో వెతుకుతున్నట్టుంది.

ఉతికిన బట్టలు పట్టుకుని, తడి తువ్వాలు వీపున కప్పుకుని ఆమె వేపుగా వచ్చిన రాంబాబుకు ఈ సంఘటన చాలా ఆశ్చర్యం కలిగించింది. నీళ్లు నింపుకున్న ఆడమ్మలు ఇద్దరు అంత దూరం వెళ్లిపోయారు. సుమిత్ర కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నట్టున్నాయి. ఆమె దైన్య వదనాన్ని చూసి చివుక్కుమన్నాడు.

'ఏమయిందమ్మా? ఏమన్నా పోయిందా?' అడిగాడు రాంబాబు.

సుమిత్ర తడబడింది. నోరు విప్పలేక పోయింది. చెప్పలేని కొన్ని విషయాలు ఉంటాయి. కొత్త వాళ్లతో చెప్పుకునేట్టు ఉండవు. పైగా అడుగుతున్నది కొత్త మనిషి. అతడిని ఆమె ఇది వరలో ఎక్కడా ఎప్పుడూ చూడలేదు.

రాంబాబుకు తెలుస్తూనే ఉంది. ఆమె పోయిన వస్తువుకోసం నది నీళ్లల్లో వెతుకుతున్నది.

సుమిత్ర మరోసారి తన మెడమీద వెతుక్కున్నది.

రాంబాబుకి ఇప్పుడు స్పష్టంగా అర్థమయింది. ఆమె మెడ బోడిగా ఉంది. మంగళసూత్రం కన్పించలేదు. అతడి ఊహ నిజమైతే ఆమె ఆందోళనకు కారణం తెలిసినట్లే.

అతనివేపు ఆమె నిస్సహాయంగా, ఆవేదనతో చూసింది. తన మెడనించి జారి నీట్లో పడిపోయింది మంగళసూత్రమే. ఆమెకి మంగళసూత్రం తీసిపెట్టటం అలవాటు లేదు. ఎల్లవేళలా అది తన మెడలో ఉండాలి. గుర్తొచ్చినప్పుడల్లా దాన్ని కళ్లకద్దుకోవటం ఆమెకి అలవాటు.

రాంబాబు ఒడ్డున ఆమె నీళ్ల బిందె ప్రక్కన ఇసికలో తను ఉతుక్కున్న బట్టలను పెట్టి, నీళ్లల్లో ఆమె స్నానం చేసిన చోట, ఆమె వెతుకుతున్న చోట వెతకసాగాడు.

ప్రవాహవేగంతో ఎంతవరకు నగ పోయి ఉండవచ్చునో ఊహించి వెతుకుతున్నాడు.

ఆమె కన్నీళ్లు నదీ దేవతకు నైవేద్యంగా కురుస్తున్నాయి.

ఇంతకీ ఆ నగ ఇక్కడ పోయిందా లేక ఇంట్లో పెట్టివచ్చి, ఆ సంగతి మర్చిపోయిందా? పోయిందని వెతుక్కుంటున్న నగ ఇంట్లోనే ఉందేమో.

'మీరు వేసుకునే వచ్చారా?'

ఆమె అవునన్నట్టు జాలిచూపు చూసింది.

'ఏం బాధ పడొద్దు. దొరుకుతుందమ్మా'. అతడు ఆమెకి ధైర్యం చెప్పాడు. ఆమెని ఓదార్చాలనుకున్నాడు. ఆమెకు ఆశాభావం కలిగించాలనుకున్నాడు.

వాళ్ల ప్రయత్నానికి ఫలితం ఉండాలి. ఆశా నిరాశలు రెండూ లేవు. దు:ఖమూ బాధా. గుడ్డ పీలికలు, కట్టె పుల్లలు, ఒకటి రెండు చేతికి తాకాయి. ఇసిక స్పష్టంగా కనిపించేంత నిర్మలంగా ఉన్నాయి నీళ్లు. పైగా ఎండ. కాని ఎంత ప్రయత్నించినా వస్తువు దొరకలేదు. అసలు నగ ఇక్కడ స్నానం చేసినప్పుడు జారిపోలేదేమో. వచ్చేటప్పుడు దార్లో జారిపోయిందో ఏమో. వచ్చిన దారి వెంబడే చూస్తే దొరుకు తుందేమో.

'నగ ఎంత ఎత్తుంటుందమ్మా?' అడిగాడు రాంబాబు. సన్నిహితునిమల్లె అడిగాడు ఆ ప్రశ్న. ఆమెను ఇప్పుడు ఓదార్చాలి. ధైర్యం చెప్పాలి. ఆమె కన్నీళ్లను ఆపాలి. అదీ అతడి ప్రయత్నం.

అతడి ప్రశ్న ఆమెకు వినిపించలేదు.

మళ్లీ అదే ప్రశ్న అడిగాడు రాంబాబు. ఆమె దృష్టిని తనవేపు ఆకర్షించాలని అతడి ఉద్దేశం.

"నగ పెద్దదా చిన్నదా ఎంత ఎత్తుంటుందమ్మా?'

తులమో అరతులమో అయితే పోతేపోయిందిలే అని తనే ఓదార్చవచ్చు. అదే పెద్దనగ అయిదారు తులాలదయితే... అట్లా ఆలోచించ సాగాడు రాంబాబు.

రాంబాబు తగుదునమ్మాఅని వచ్చి తనకడ్డంపడి నగ వెతకటమే సుమిత్రకు ఇబ్బంది అనిపించింది. ఈ ప్రశ్నలు ---- కొత్త మూలంగా ఆమెకి అతడితో మాటాడటమే ఇష్టంలేదు. అయితే మంచివాడిలా కన్పించాడు. అందువల్ల ఆమె నోరు విప్పింది. 'ఐదు తులాలు' అంది. మంగళసూత్రం అత్తయ్య చెయ్యించింది. అంతకు మించి మరో నగ ఆమె మెడలో లేదు. సుందరంకి నగలంటే పడదు. మంగళ సూత్రాన్ని నగగా కన్న ఒక పవిత్రమైన చిహ్నంగా సుందరం భావించాడు. దాంపత్య జీవిత శుభఅలంకారం అది. మూడుముడులతో ఆమెను జీవితంలోకి స్వీకరించిన

ప్రేమ సంకేతం అది. గౌరీపూజ చేసి పురోహితుడు దాన్ని పవిత్రం చేసిన అలంకారం అది. పెళ్లిలో ఈ మంగళసూత్రధారణ శుభగడియలు, సుముహూర్తం దానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఓ జంట —— యువతీ యువకులు దాంపత్య జీవితంలో అడుగు పెట్తున్న సుందరసన్నివేశంతో అనుబంధమున్న పవిత్రఆభరణం అది. ఇప్పుడు సుమిత్ర కళ్లలోంచి కారుతున్న కన్నీళ్లు సాక్ష్యం ఆమెకు మంగళసూత్రంతో ఉన్న బంధం ఎట్లాంటిదో, ఎంత గాఢమైనదో తెలుసుకోవటానికి. ఆమె కన్నీళ్లు ఆగటం లేదు.

ఇంట్లో నగపోయిందని తెలిస్తే భర్త కోప్పడతాడా? అత్త తిడ్తుందా? మామ వేధిస్తాడా? లేక విలువైన వస్తువు పోగొట్టున్నందుకు ఆమె బాధ పడుతున్నదా? రాంబాబు సందేహాలు.

దాదాపు రెండు గంటలయింది. సూర్యుడు తలమీదికి వచ్చాడు. ఇది ఇంత ఆలస్యం ఎందుకయిందని ఇంట్లో వాళ్లు నదికి వస్తారో ఏమో. రాంబాబుకు ఇది ఆలస్యమే. రాంబాబు సెకెండరీ గ్రేడ్ టీచర్స్ ట్రైనింగ్ చేస్తున్నాడు. హాస్టల్‌లో ఉంటున్నాడు. అందరి భోజనాలు అయిపోయి ఉంటాయి. ముందు చెప్తే తప్ప తన భోజనం స్నేహితులు ప్లేట్లో తీసి పెట్టరు. తీసారో లేదో. లేకపోతే ఈ పూటకి దుప్పే. అందుకని ఆకలి గుర్తొచ్చి 'మీరింట్లో చెప్పండి —— ఎవరినన్నా తీసుకుని వచ్చి వెదికితే దొరక్కపోదు. ఎక్కడికీపోదు. పడిపోయిన వస్తువు మాయమైపోతుందా. తప్పక దొరుకుతుంది' అన్నాడు.

నిజానికి ఈ మాటలు సుమిత్ర వినలేదు. ఆమె అన్యథా ఆలోచిస్తున్నది. పెద్ద మానసిక ఆందోళనతో కుంగిపోతున్నది. తన చిన్న తనంలో పొరుగింటి లచ్చిమి మంగళసూత్రం పోయింది. అది పోయిన పక్షంరోజుల్లో భర్తకి ప్రమాదం వచ్చి చనిపోయాడు. ఇద్దరు పిల్లలతో లచ్చిమి దిక్కులేనిది అయిపోయింది. అప్పుడు అనుకున్నారు వివాహ ముహూర్తం బాగాలేదని. మంగళసూత్రం పోవడం దుశ్శకునం అని. ఆ మాటలు సుమిత్ర ఎప్పుడో మరచిపోయింది. కాని ఇప్పుడు లేనిపోనివన్నీ గుర్తొస్తున్నాయి. ఆమె కన్నీళ్లయితే ఆగినాయికాని ఆమె దు:ఖం ఆగలేదు.

'మీ నగ పోదమ్మా. బాధపడవద్దు. మా స్నేహితుని ఉంగరం పోతే పొలంలో —— వెతికి చిటికెలో తీశాడు. మనకు కనపడక పోవచ్చు. వాళ్లకి కనిపించవచ్చు. తప్పక దొరుకుతుంది. ఇంట్లో చెప్పండి' అని మరోసారి ధైర్యం చెప్పాడు.

ఆమె రాంబాబు వేపు అతడు చెప్తున్న మాటలు వింటూ చూసింది.

అయితే అట్లా ఆమె రాంబాబు వేపు చూస్తున్నప్పుడు అతడి వెనక దూరంగా

నది ఆ ఒడ్డున శవదహనం మంటలు కన్పించాయి.

'నేను చెప్పింది వినండి. మనం ఇంతసేపు వెతికాము. నగ దొరకలేదు. ఇంక ఎంతసేపు వెతికినా ఫలితం లేదు. ఇక్కడే పొద్దు గడపవద్దు. పోయి —— తొందరగా పోయి ఇంట్లో ఈ సంగతి చెప్పండి.' అని పెద్ద మనిషి మోస్తరుగా సలహా ఇచ్చాడు. ఆమెకి తన పట్ల అభిమానం, కృతజ్ఞతా భావం కలగటానికయినా ఆ నగ తనకి దొరికితే బావుండును అని అతడి ఆశాభావం. తప్పక —— నగ ఇక్కడే —— స్నానం చేస్తున్నప్పుడే —— పోయినట్టయితే దొరక్క ఏమవుతుంది?' అని భరోసా. దొరుకుతుందన్న ఆశ, నమ్మకం అతడి మాటల్లో స్పష్టంగా తెలుస్తున్నాయి.

సుమిత్రని భయం ఆవహించింది. ఆ భయం గుప్పిట్లో ఇరుక్కున్న ఆమెకి దూరంగా చితి మంటలు కళ్లు మూసుకున్నా కన్పిస్తున్నాయి.

'మీ అన్నయ్యలా చెప్తున్నాను. వినండి నామాట.' అనే సరికి సుమిత్రకి ఆ భాష అర్థమయింది. అతడి కళ్లల్లోని అభ్యర్థన ఆమెకి విన్పించింది.

నిరాశతో బైటికి వచ్చి నీళ్లబిందెను చంకన పెట్టుకుని ముందుకు సాగింది సుమిత్ర.

'దార్లో ఓసారి చూస్తూ వెళ్లండి. దార్లో పడిపోయిఉంటే దొరకవచ్చు' అని కూడా రాంబాబు ఆమెకి సలహా ఇచ్చాడు.

'ఇట్లా మంగళ సూత్రం పోయినప్పుడు —— ఆ దోషం పోవటానికి ఏవో పూజలు చేస్తారు. బాపనయ్యన్ని అడిగితే చెప్తాడు' అని కూడా మరో సలహా ఇచ్చి రాంబాబు తన దారిన వెళ్లిపోయాడు. సుమిత్ర సరుగుడు తోటల మధ్యనించి పోయి, సందుదాటి —— తమ ఇంటి పెరట్లోకి చేరుకుంది. దారి పొడవునా చూసుకుంటూ, వెతుక్కుంటూ వెళ్లింది. ఎక్కడా నగ కన్పించలేదు.

* * *

సుందరం తల్లి ప్రక్కింటి స్టూడెంట్‌ని ఆఫీస్‌కి పంపించి కొడుకును ఇంటికి రప్పించి జరిగిన సంగతి యధాలాపనగా చెప్పింది. ఆమె బాధపడుతున్నట్టుగాని, విలువైన నగ పోయినందుకు నిందిస్తున్నట్టుగా గాని చెప్పకుండా కోడలుగాని, కొడుకుగాని బాధపడకూడదని జాగ్రత్తపడి చెప్పింది. సుందరంకి అది బాధపడవలసిన విషయంగా అనిపించలేదు. మాంగల్యమహత్యాలు శుభము అశుభము వంటి నమ్మకాలు అతడికి లేవు. తెలీవు. అయితే ఆ నగ —— అమ్మ ఒంటిమీద ఉన్న మొత్తం బంగారంతో పెళ్లి సందర్భంగా చేయించింది కావటం వల్ల

తల్లి ఇచ్చిన ఒక విలువైన ప్రేమ కానుక పోయిందన్న భావం కలిగి చింతించాడు.

ఆ నగ, నదిలో స్నానం చేస్తున్నప్పుడు జారిపడిపోయి ఉంటే తప్పక దొరుకుతుందనిపించింది. భార్యను తీసుకుని నది రేవుకి వెళ్లాలనుకున్నాడు. కాని అప్పటికే సుమిత్ర కృంగిపోయి ఉంది. ఆమె బాధ చూసి మళ్లీ ఆమెను ఒత్తిడికి గురిచేయటం తట్టుకోలేదనిపించి రేపటికి వాయిదా వేసుకున్నాడు. 'మన వస్తువైతే దొరుకుతుంది. మన వస్తువు కాకపోతే దొరకదు' అనే పెద్దల మాట వల్లించి మనసులో పట్టించుకోనట్టు ప్రవర్తించాడు. సుమిత్రను ఇప్పుడు ఓదార్చటం ముఖ్యం. సుమిత్రకి ధైర్యం చెప్పటం ముఖ్యం అన్పించింది సుందరంకి.

పురోహితుడిని పిలిపించి మాట్లాడితే, 'దోషం. గ్రహశాంతి చేస్తే ఆ దోషం పోతుంది' అని అభయవచనాలు చెప్పాడు. అయితే పురోహితుడు మాట్లాడుతున్నప్పుడు 'దోషము. గ్రహశాంతి చేస్తే దోషం పోతుంది' అన్న మాటలు సుమిత్ర చెవిలో పడ్డాయి. ఆ మాటలు ఆమెను కలవరపరచాయి.

రెండేళ్ల కాపురంలో సుమిత్రకు అత్తవారింట ఇట్లాంటి గడ్డు సమస్య ఎదురవలేదు. ఇంటి సమస్యలు ఏమన్నా ఉంటే ఆ తల్లీ కొడుకుల మధ్య నలిగేవే తప్ప కోడలు వరకు రానిచ్చే వాళ్లు కాదు. కోడలంటే అత్తకి ముద్దు.

సుమిత్రను ఓదార్చాలని సుందరం, రోజూ మాదిరిగానే 'సుమిత్రా ఇలా రా చూడు' అని పిలిచాడు. సుమిత్ర దగ్గరికి వచ్చింది. ఆమె పరితప్త హృదయంతో భర్తని చూసింది. ఆమెని ఉత్సాహపరచాలని 'ఇట్లా కూచో' అని తన ప్రక్కనే ఆమెని తన చేతుల్లోకి తీసుకుని మంచం మీద కూర్చో బెట్టుకున్నాడు. 'అంత బాధ పడకూడదు. పోతే పోయింది. అన్నీ మన మంచికే అంటారు కదా. ఇది పోకుండా పోతే యింకే ప్రమాదం జరిగేదో. నా మట్టుగ నాకు —— దీన్ని మరచిపోవడం మంచిది. రేపు వెళ్లి మరోసారి వెతికితే తప్పని సరిగా దొరుకుతుంది.' అన్నాడు.

ఓదార్చుతున్నట్టే చెప్పిన మాటలు ముగింపులో 'మరోసారి వెతికితే' అన్నమాటలో భర్త బాధ తెలుస్తూనే ఉంది. ఆమె కండ్లనించి కన్నీళ్లు జలజల కురిసాయి.

తల్లి సుందరంతో 'సుమిత్రను బాధ పెట్టకు. దిగులు పెట్టుకుంది. అప్పుడే కుప్పకూలింది. మరీ మరీ గుర్తు చేయకు. దోషం ఉంటే గ్రహశాంతి చేయిద్దాం. మన పురోహితునికి కబురు పెట్టాను. ఆయనేం చెప్తాడో...' అని గట్టిగా హెచ్చరించింది.

సుమిత్రకి అత్త మాటలు గాని భర్త మాటలుగాని సంతృప్తి కలిగించలేదు. మంగళసూత్రం తన జీవనజ్యోతి. ఆమె జీవనసూత్రం దానిమీదనే ఆధారపడింది.

ఎవరు ఎన్ని విధాలు ఓదార్చినా ఆమె మనసు సమాధాన పడలేదు. వాళ్ల మాటలను ఆమె విశ్వసించలేదు. తెల్లబోయి మౌనంగా చూస్తున్నది.

* * *

రాంబాబు ఈ మధ్య రెండు దినాలు సెలవు తీసుకుని స్వగ్రామం వెళ్లాల్సి వచ్చింది. పెళ్లి చూపులని వెళ్లిన తర్వాత తెలిసింది. పెళ్లి అతడికి ఇష్టం లేదు. చదువు పూర్తి కావాలి. ఉద్యోగం దొరకాలి. ఉద్యోగం చేస్తూ పై చదువులు చదువుకోవాలి. కనీసం డిగ్రీ పూర్తి చెయ్యాలి. వేరే మంచి ఉద్యోగం —— ఇంతకన్నా మంచి జీతం వచ్చే ఉద్యోగం సంపాదించుకోవాలి. తల్లిదండ్రులు తన ప్రవర్తనకు బాధ పడకూడదు. తల్లి దండ్రులకు నచ్చ జెప్పి వాళ్లను ఒప్పించాడు. శని ఆది వారాలు కలిశాయి. తిరిగి వచ్చిన తర్వాత నదికి స్నానానికి వెళ్లేసరికి వారం దినాల క్రిందటి సంఘటన గుర్తొచ్చింది.

ఆ నగ దొరికిందా? వచ్చి మళ్లీ వెతికారా? ఏమయింది. ఆమె కన్పిస్తే బావుండును. అడిగితే తెలిసేది. రేవులో స్నానాలకు వచ్చి నీళ్లు తీసుకు పోయే వాళ్లలో ఆమెను వెతుకుతున్నాడు.

మరో వారం గడిచింది.

ఆ రోజు ఉదయానే వచ్చి అదే రాయి మీద కూర్చుని బట్టలు ఉతుక్కోవటానికి సిద్ధపడుతున్నాడు. తన ట్రంక్ పెట్టె తాళం చెవి జారి నీళ్లలో పడిపోయింది. నీళ్లల్లోకి దిగి వెతకసాగాడు. ఏమి పోయిందని ఒకరిద్దరు అడిగారు. తాళం చెవి అని విని వెళ్లిపోయారు. తను కూర్చున్న చోటికి కొంచెం దూరంగా పడింది. రాయి దగ్గర లోతు ఎక్కువ. మునక వేస్తేనే తప్ప ఇసికలో వెతుక్కోవటం సాగదు.

ఉదయం జనంతో రేవు రద్దీగా ఉంది. యువకులు, యువతులు, పెద్ద వయసు స్త్రీ పురుషులు, ముసలివాళ్లు, నీళ్లలో సూర్యవందనాలు చేసుకునే నిష్టాపరులు, కావుళ్లతో నీళ్లు మోసుకుపోయే మగవాళ్లు, కీర్తనలు పాడుతున్న భక్తురాళ్లు —— సందడిగానూ, చూడ ముచ్చటగానూ, కళకళ్లాడుతున్నది రేవు.

తాళం దొరకలేదు. రాంబాబు ఇబ్బంది పడుతున్నాడు. తాళం చెవికే తాను ఇంత బాధపడుతున్నాడే మరి బంగారం నగ అయిదుతులాల మంగళ సూత్రం... ఆమె ఎంత బాధ పడిందో ఆ రోజు....

తాళంచెవి రాయి మీద పడి జారిపోయింది. అయితే నీళ్లల్లో మునిగి వెతకాలి. అక్కడే పడి ఉంటుంది. విసుగెత్తిపోయి ఆఖరి ప్రయత్నం చేశాడు.

జనం సందడి సందడిగా ఉన్నారు.

రాంబాబు కుడిచేతివేళ్లు ఆశ్చర్యపోయాయి. అతడు నీళ్లల్లోంచి లేచాడు. చేయి నీళ్లల్లోనే ఉంది. అవును. అదే. దొరికింది. కాని ఎవరి దృష్టిలోనూ పడకూడదు. ఎలా బైటికి తీయడం. వీళ్లు అంతా చూస్తారు. వాళ్లకు తెలియకూడదు. ఇతర్లు చూడకూడదు. దొంగతనం చేస్తున్నంత భయం. కాని తప్పదు. ఓ చేత్తో రాతిమీది తువ్వాలందుకున్నాడు. తువ్వాలును నీటిలో ముంచి దాన్లో దాచి పెట్టాడు. అప్పటికి రాంబాబుతో వచ్చిన స్నేహితులు స్నానాలు ముగించి ఉదయం క్లాసు తొందర్లో వెళ్లి పోయారు.

ఆమె బంగారు నగ —— మంగళ సూత్రం. రాంబాబు ఆ నగను చూడలేదు. కాని తెలుసు. తన తాళం చెవికోసం వెతకటం సాగించాడు. దొరకలేదు. అతడికి అక్కడ అట్టేసేపు ఉండటం భయంగా ఉంది... భయంగా ఉంది... భయంగా ఉంది. ధైర్యం నటించాడు. తన పనులు ముగించుకుని —— తాళం చెవి ప్రయత్నం విరమించుకుని బైటపడ్డాడు. తిరిగి హాస్టల్‌కి పోతుంటే దార్లో పోలీస్‌వాడు ఎదురయ్యాడు. కాళ్లు వణికాయి. పక్కకు తప్పుకుని, నిర్భయం నటించి నడిచి వెళ్లిపోయాడు.

గదికి వెళ్లాడు. ఎవరూ గదిలో లేరు. అంతా ఫలహారాలకి వెళ్లారు. చుట్టూ చూశాడు. గదిలో తనతో పాటు మరో ముగ్గురు ఉంటారు. వారి ట్రంకులూ, బుట్టలు, వస్తువులూ తనని చూస్తున్నాయి. నగని పెట్లో దాచబోయాడు. తాళం చెవి లేదు. పరుపుచుట్టలో, దిండుకవరులో ఎక్కడ దాచాలన్నా —— స్నేహితులు వచ్చి ఆ పరుపు చుట్ట విప్పి పరచుకుని కూర్చుంటారు. తమకు గదుల్లో కూర్చోవటానికి నేలమీద చాపలు, పరుపులే దిక్కు. ఎక్కడ దాచిపెట్టే భద్రంగా ఇతర్లకంట కనబడకుండా ఉంటుందో ఎంత వెతికినా ఏ చోటూ కన్పించలేదు. పేంట్ జేబే భద్రం.

అయినా పోలీస్ స్టేషన్‌కి పోయి చెప్పి ఇచ్చేస్తే...

మంచి ఉపాయం తట్టింది. తన పేంట్ జేబులోనే ప్రస్తుతానికి భద్రం. తాళాలు బాగుచేసేవాడితో పెట్టె తాళం బాగు చేయించిన తర్వాత ఆ బెంగ తీరింది.

ఆమె కన్పిస్తుంది. ఆమెకి స్వయంగా ఆ పవిత్రమైన నగని ఇచ్చెయ్యాలి.

ఈ విషయం స్నేహితులతో చెప్పి తన మనసులోని బరువు తీర్చుకోవాలని ఆలోచన. అయినా సందేహం... కొత్త సమస్యలు తెచ్చి పెట్టారేమో. ఇవ్వద్దు. మనం తీసుకుందాం అంటారేమో... తన మీద దొంగతనం నేరం మోపుతారేమో. ఎవరికీ

చెప్పకూడదనుకున్నాడు రాంబాబు.

'ఇదిగో నీ టిఫిన్. కాఫీ' తెచ్చి పెట్టాడు రూమ్‌మేట్ గంగాధర్రావు.

అందుకుని తన చోటులో పక్క చుట్టమీద కూర్చుని ముందు కాఫీ తాగాడు. మెల్లగా టిఫిన్ తినసాగాడు. ఆ టిఫిన్ తెచ్చిన రూమ్‌మేట్‌కి థాంక్స్ కూడా చెప్పలేదు.

క్లాసుకుపోయే హడావిడిలో మిగిలిన రూమ్‌మేట్స్ కూడా వచ్చి పుస్తకాలు సర్దుకుంటున్నారు. టీచింగ్ ప్రాక్టీస్‌కి ఉదయం పూట వేరే స్కూల్‌కి పోవాలి. ఆ ఏర్పాట్లలో ఉన్నారు. ఎవరూ అతడిని పట్టించుకునేట్టులేదు.

ఇవేళ తనకు టీచింగ్ ప్రాక్టీస్ లేదు. క్లాసుకు ఇవాళ పోవాలని లేదు. సెలవు పెట్టాడు.

'తాళం చెవి పోయింది. బట్టలు పెట్లో ఉండిపోయాయి. తాళం చెవులు వాడిని తీసుకురావాలి' అని కారణం చెప్పాడు.

హాస్టల్ పై గదులన్నీ నిర్మానుష్యం అయిపోయాయి.

ఎవరూ లేరు.

క్రింద స్పెషల్ డ్యూటీ సహాధ్యాయి పర్యవేక్షణ సహాయం. వంట బ్రాహ్మడు పనివాళ్లు —— పెరుగు తెచ్చే ఆమె. వాళ్ల సందడి విన్పిస్తున్నది.

తాళం సులభంగానే మేకుతో తీసేయగలిగాడు. చుట్టూ చూశాడు. తన పేంట్ జేబులోని నగని జాగ్రత్తగా తీసి పెట్లో దాచిపెట్టాడు. పైన బట్టలు కప్పేసేట్టు పెట్టాడు. రోడ్డు మీద ఎదురుగా ఉన్న ఫాన్సీషాప్‌లో కొత్త తాళం కొనుక్కుని తెచ్చి తాళం వేశాడు. పెట్టెపైన తన పరుపు చుట్టను పెట్టాడు.

రాంబాబు నిశ్చింతగా ఊపిరి పీల్చుకుని నిట్టూర్చటానికి, గంటన్నర తర్వాతగాని వీలుచిక్కలేదు. తాను తప్పు చేయటం లేదని, ఆ నగ ఆమెకి తప్పక అందజేస్తాడని, దాంతో తనకు సంతోషంగా ఉంటుందని అతడు తన మనస్సును శాంతింపజేశాడు. అంతటితో అతడిలోని భీరుత్వం స్థిమిత పడింది.

ఎవరన్నా తన ఈ వ్యవహారం మొత్తం కనిపెట్టి చూస్తున్నారేమో. దొంగ చాటుగా పరీక్షిస్తున్నారేమో! వాళ్లు, సమయం చూసి వ్యవహారం బైట పెట్తారేమో! మరొకసారి బైటికి వచ్చి పరిసరాలని పరీక్షగా చూశాడు. లోకం తనని గమనించటం లేదు.

పదిగంటల సమయంలో ఆమె రేవు వేపు రావచ్చుననిపించి రాంబాబు నదివేపు బయల్దేరాడు. ఆ సమయానికి రేవులో జనం ఉండరు. ఒకరిద్దరు ఆడమ్మలు. ఇద్దరు

ముగ్గురు పది పన్నెండేళ్ల చిన్న పిల్లలు అంతే.

నాగావళి విచారంతో చిక్కిపోయింది. ఈ కొద్ది దినాలకే నదీమాత రూపు రేఖలు మారిపోయినట్టుగా కనిపించింది. ఆ సమయంలోనే ఆమె వస్తుంది. రెండు రోజులు వరసగా వెళ్లి ఆమెకోసం చూశాడు.

కొత్త మంగళ సూత్రం చేయించుకుని ఉంటుంది.

రాంబాబుకు తన ప్రవర్తన తెలివి తక్కువగా తోచింది.

మూడోరోజు రాంబాబు ఆమె వెళ్లిన తోవన వెళ్లి ఆ సమీపంలో ఇళ్లల్లో ఆమె కన్పిస్తుందేమో చూడాలనిపించింది. ఆ ప్రయత్నం సయితం ఫలించలేదు.

మూడు రోజులు వరసగా క్లాసులకు రాకపోయేసరికి హెడ్మాష్టర్ పిలిచి కోప్పడి చీవాట్లు పెట్టాడు.

రాత్రిళ్లు నిద్ర పట్టటం లేదు... స్వప్నాలు వస్తున్నాయి. కలవరి స్తున్నాడట. పోలీస్‌లు కొట్టున్నట్టు స్వప్నం వచ్చింది. ఉలికిపాటుతో లేచాడు. ఒళ్లంతా చెమట పట్టింది.

నెలదినాలయింది.

రాంబాబు చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఈ నగ తన దగ్గరుంటే తనకి అపాయం తప్పదు అన్న భయం పట్టి పీడించసాగింది. ఓ రోజు సాయంత్రం చీకటి పడుతున్న సమయాన నదిలో జనసంచారం బొత్తిగా లేనిప్రాంతానికి వెళ్లాడు.

నది ఒడ్డున ఓ ప్రక్క చితిమంటలు... ఆ సాయంత్రం మునిమాపు వేళ...

నది ఒడ్డున తడిగుడ్డలతో మోకాళ్లల్లోకి తలదించుకుని ఓ యువకుడు తన దౌర్భాగ్యానికి కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. సుమిత్రా ... నా సుమిత్రా అని ఏడుస్తున్నాడు. ఆ సుమిత్ర ఎవరో ఆ యువకుడు ఎవరో రాంబాబుకు తెలీదు. రాంబాబు కొద్దిసేపు నది ఒడ్డున కూర్చున్నాడు.

చితిమంటలు కన్పిస్తున్నాయి.

అప్పుడప్పుడు నది ఒడ్డున వల్లకాడు వేపు కనిపించే దృశ్యాలే అవి.

మరికొంచెం దూరం ముందుకు వెళ్లాడు. నదీమాతకు మనసారా మరోసారి రాంబాబు నమస్కారం చేశాడు. తన జేబులోని నగని బైటికి తీసి ప్రవాహంలోకి విసిరేశాడు.

మరోసారి నదీమాతని నమస్కరించాడు. నదిలోకి దిగి కాళ్లూ చేతులూ కడుక్కుని, ముఖం కడుక్కుని, నదిలో ఆకాశంలోని కాంతిసంవత్సరాల దూరాల్లో

ప్రకాశిస్తున్న నక్షత్రాలను శాంతంగా చూశాడు. ఆ నక్షత్రాలు అతడిని ఆశీర్వదిస్తున్నట్టు కన్పించాయి.

ప్రశాంతంగా చాలాసేపు కూర్చున్నాడు...

శవదహనం చేసిన వాళ్లు... నదిలో స్నానానికి వచ్చారు అయిదుగురు. వాళ్లలో ఓ వ్యక్తి 'సివారికి కొత్త పుస్తెల తాడు కూడా సేయించారట. అయినా పేనం దక్కలేదు' అని చెప్తున్నాడు పక్కవాళ్లకి.

రాంబాబు అంతర్లోకాలు క్షణం పాటు స్థబ్దమయ్యాయి.

మరోసారి భగవంతుని స్మరించుకున్నాడు రాంబాబు.

ఈ సారి అతడి కళ్ల నుండి కట్టలు తెగి ప్రవహించాయి కన్నీళ్లు.

* * *

*('జీవనజ్యోతి' రచయిత పి. చలపతి రావు పేరుతో 'భారతి' సాహితీ మాస పత్రికలో తొలిసారి అచ్చయింది. మార్చ్ 62)*